# నత్తకడకన అభివృద్ధి పనులు

- నియోజకవర్గంలో 20కి పైగా పెండింగ్ పనులు
- కాంట్రాక్టర్ల సమ్మెతో పనుల్లో మరింత జాప్యం
- ఆరేళ్లుగా అంబర్‌పేటలో ట్రాఫిక్ కష్టాలు
- వర్షకాలం సమీపిస్తుండటంతో ఆందోళనలో ప్రజలు


నల్లకుంటలో రోడ్డును మూసివేయడంతో నిలిచిన రాకపోకలు

**అంబర్‌పేట:** నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులు నత్తనడకన సాగుతున్నాయి. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి కాకపోవడంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు నిత్యం అవస్థలు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన జీహెచ్‌ఎంసీ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- నియోజకవర్గంలోని ఐదు డివిజన్‌లలో సుమారు 20 అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. రోడ్లను తవ్వి వదిలేయడంతో ప్రజల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. చిన్నారులు, వృద్ధులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా చేపట్టిన అభివృద్ధి పనులను సత్వరమే పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**సమీపిస్తున్న వర్షాకాలం...**

వర్షకాలం సమీపిస్తున్న నేపథ్యంలో వర్షాలతో అభివృద్ధి పనులకు ఆటంకం కలిగే అవకాశం ఉంది. దీంతో ప్రజాధనం వృధా అయ్యే అవకాశం ఉందని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. వర్షకాలం రాకముందే చేపట్టిన పనులను పూర్తి చేయాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

**సమ్మెలో కాంట్రాక్టర్లు...**

పనులను దక్కించుకుని పూర్తి చేయాల్సిన కాంట్రాక్టర్లు ఈనెల 18 నుంచి సమ్మె చేస్తున్నారు. అప్పటి నుంచి అభివృద్ధి పనులు ఎక్కడిక్కడ నిలిచిపోయాయి. సరిగ్గా వర్షాకాలం ముందు కాంట్రాక్టర్లు సమ్మెకు దిగడం గమనార్హం. గత కొద్ది నెలలుగా వారికి రావాల్సిన బిల్లులు రాకపోవడంతో సమ్మె చేస్తున్నారు. కాంట్రాక్టర్ల సమ్మె ఎప్పుడు ముగుస్తుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అసలే అంబర్‌పేట్‌కు ట్రాఫిక్ కష్టాలు...**

అంబర్‌పేట ప్రజలు ప్రతినిత్యం ట్రాఫిక్ ఇక్కట్లతో అవస్థలు పడుతున్నారు. నియోజకవర్గం నడిబొడ్డున చేపట్టిన ఫ్లైఓవర్ పనులు గత ఆరేళ్ల నుంచి కొనసాగుతూనే ఉన్నాయి. దీనికి తోడు అలీకేఫ్ చౌరస్తా నుంచి దిల్‌సుఖ్‌నగర్ వైపు వెళ్లే దారిలో ముసారంబాగ్ బ్రిడ్జ్ పనులు సహితం ప్రారంభించారు. దీంతో అంబర్‌పేటలో ప్రధాన రహదారులన్నీ మూసుకుపోయాయి. ఎక్కడిక్కడ ట్రాఫిక్ మళ్లింపులు ఉండటంతో స్థానికులతో పాటు ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వాహనదారులు తీవ్ర గందరగోళానికి గురౌతున్నారు.

- అంబర్‌పేటలోకి వాహనదారులు రాగానే బయటకు ఎలా వెళ్లాలో తెలియక ఆయోమయానికి లోనవుతున్నారు. కొన్ని ప్రత్యామ్నాయ రోడ్లలో జీహెచ్‌ఎంసీ అభివృద్ధి పనులు చేపట్టడంతో రాకపోకలు మరింత జటిలంగా మారాయి. ఇప్పటికైనా చేపట్టిన అభివృద్ధి పనులు సత్వరమే ప్రజాప్రతినిధులు, అధికారులు చొరవ తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

## రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటం


రైతు సంఘం సదస్సులో మాట్లాడుతున్న సారంపల్లి మల్లారెడ్డి

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** ప్రభుత్వాలు అవలంభిస్తున్న రైతాంగ వ్యతిరేక విధానాల వల్ల వ్యవసాయ రంగం సంక్షోభాన్ని ఎదుర్కొంటుందని రైతాంగ సమస్యల పరిష్కారానికి ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని అఖిల భారత రైతు సంఘం నాయకులు సారంపల్లి మల్లారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం విస్తృతస్థాయి రాష్ట్ర కమిటి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో 2020–21 నుంచి వ్యవసాయ ప్రణాళిక ప్రకటించడం, ఆన్‌లైన్‌లో నమోదు చేయడంగానీ జరగలేదన్నారు. రాష్ట్రంలో విత్తనోత్పత్తి రైతులకు ఎలాంటి రక్షణ లేదని విమర్శించారు. కంపెనీల వారు రైతులను అనేక విధాలుగా మోసం చేస్తున్నారని ఆరోపించారు. రైతు సంఘం ప్రధాన కార్యదర్శి టి.సాగర్, రైతు సంఘం అధ్యక్షులు పాతినేని సుదర్శన్‌రావు, సంఘం ఉపాధ్యక్షులు జూలకంటి రంగారెడ్డి, ప్రసాద్‌రావు, జంగారెడ్డి, చంద్రారెడ్డి, శోభన్‌నాయక్, వెంకటేశ్వర్లు, రమేష్, ప్రేమిళ, బాలకృష్ణ పాల్గొన్నారు.

## జనగణన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి



మాట్లాడుతున్న మద్దికాయల అశోక్ ఓంకార్

**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** రాష్ట్రంలో జనగణన నిర్వహించిన తర్వాతే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని ఎంసీపీఐయూ జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లను అమలు చేసి ఎన్నికలు నిర్వహించాలన్నారు. హడావిడిగా ఎన్నికలు నిర్వహించి బీసీలకు అన్యాయం చేయొద్దని కోరారు. మంగళవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 1980లో మండల కమిషన్ ఇచ్చిన రిపోర్టు ప్రకారం 43 శాతం రిజర్వేషన్లను బీసీలకు ఇవ్వాలని చెప్పినప్పటికీ ఇంకా బీసీ సమాజాన్ని దోపిడీ చేస్తున్న తీరు సరికాదన్నారు. ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనం సుధాకర్, గోనె కుమారస్వామి, కుంభం సుకన్య, వెంకన్న, మట్టయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

## వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలి


సిబ్బందితో జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ వెంకటి

**ముషీరాబాద్:** వైద్య సిబ్బంది విధి నిర్వహణలో తప్పనిసరిగా సమయపాలన పాటించడం చాలా ముఖ్యమని హైదరాబాద్ జిల్లా వైద్యశాఖ అధికారి డాక్టర్ జె.వెంకటి అన్నారు. నిర్లక్ష్యం వహించే వైద్య సిబ్బందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మంగళవారం ముషీరాబాద్ ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని డాక్టర్ వెంకటి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. మహిళల ఆరోగ్యం, చిన్నారుల వ్యాక్సిన్, గర్భిణీలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఏఎన్‌ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, సమయ పాలన పాటిస్తూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. దీనికోసం ఆకస్మికంగా యూపీహెచ్‌సీలను సందర్శించి వివరాలను సేకరిస్తున్నామన్నారు. ప్రజలకు మరిన్ని మెరుగైన వైద్యసేవలు అందించేలా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. ఏఎన్‌సీడీ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ అశ్రిత, ముషీరాబాద్ యూపీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ దీప్తిప్రియాంక, పీహెచ్‌ఎన్ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే చెల్లించాలి



**లిబర్టీ:** ఫీజురీయింబర్స్‌మెంట్‌ను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వల్లమూరి కృష్ణస్వరూప్ డిమాండ్ చేశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ సకాలంలో రాకపోవడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల విద్యార్థులు తీవ్ర అగచాట్లు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రైవేటు కాలేజీల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్, మైనార్టీ విద్యార్థులకు రెండేళ్లుగా ఫీజు రియంబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయడంలేదని తెలిపారు. ఇంజనీరింగ్, మెడికల్, ఇతర కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు కళాశాలల యాజమాన్యాలు సర్టిఫికెట్లు ఇవ్వకుండా వేధిస్తున్నాయని చెప్పారు.

## అధ్యాపకులనే రెగ్యులర్ వీసీలుగా నియమించాలి


గడ్డం శ్యామ్, పీడీఎస్‌యూ నేత

**ముషీరాబాద్:** రాష్ట్రంలోని పది యూనివర్సిటీల వీసీల పదవీ కాలం ముగిసినందున తక్షణమే రెగులర్ వీసీలను నియమించాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షులు గడ్డం శ్యామ్ డిమాండ్ చేశారు. మంగళవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జి వీసీలుగా నియమించడం సరికాదని, తక్షణమే అధ్యాపకులతో పూర్తిస్థాయి వీసీలను నియమించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని యూనివర్సిటీలకు ఐఏఎస్ అధికారులను ఇన్‌చార్జ్ వీసీలుగా నియమించడంతో యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కుంటుపడుతుందని తెలిపారు. ఐఏఎస్ అధికారులు ప్రభుత్వ పాలనలో అనేక బాధ్యతలు నిర్వర్తిస్తూ.. ఇతర సమస్యలపై వారు సమయం కేటాయించలేరని తెలిపారు. గతంలో ఇన్‌చార్జి వీసీగా ఉన్న అరవింద్‌కుమార్ విషయంలో ఇదే జరిగిందన్నారు. వీసీల పదవీకాలం ముగుస్తుందని ప్రభుత్వానికి తెలిసినప్పటికీ ఆ నియామక ప్రక్రియను వేగవంతం చేయకుండా ఇన్‌చార్జి వీసీలను నియమించడమంటే కాలయాపన చేయడమేనన్నారు. తక్షణమే పూర్తిస్థాయి వీసీలను అక్కడ పనిచేసే అధ్యాపకులతో నియమించాలని కోరారు.

## ఆలయ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్


ఎమ్మెల్యే ముఠాగోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

**కవాడిగూడ:** కవాడిగూడ డివిజన్ బండమైసమ్మనగర్‌లోని పహాడి హనుమాన్ దేవాలయంలో షిరిడీ సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనతో పాటు ఆలయ నిర్మాణానికి భక్తులందరూ సహకరించాలని ఎమ్మెల్యే ముఠాగోపాల్ సూచించారు. మంగళవారం శంకుస్థాపన పూజలో ఎమ్మెల్యే దంపతులు, స్థానిక కార్పొరేటర్ రచనశ్రీ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పహాడి హనుమాన్ దేవాలయంలో శ్రీషిరిడి సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపన ఆలయ నిర్మాణం తదితర విగ్రహాలు ఏర్పాటుకు భక్తులు సహకారం అందించాలని కోరారు. ఆలయ కమిటీ సభ్యులు తండా రాములు, శ్రీకాంత్, కె.ఎన్ మూర్తి, ధన్‌రాజ్, బీజేపీ నేతలు వెంకటేష్, బీఆర్‌ఎస్ కవాడిగూడ డివిజన్ అధ్యక్షుడు శ్యామ్‌యాదవ్, బీఆర్‌ఎస్ నేతలు రాములు, రమణ, సంతోష్, జి.రాములు, జమాలుద్దీన్, భక్తులు, బస్తీ వాసులు పాల్గొన్నారు.

## టీజేఎస్ గ్రేటర్ ఉపాధ్యక్షుడిగా జైపాల్‌రెడ్డి


నియామకపత్రాన్ని అందజేస్తున్న ప్రొఫెసర్ కోదండరామ్

**ముషీరాబాద్:** తెలంగాణ జనసమితి గ్రేటర్ హైదరాబాద్ కమిటి ఉపాధ్యక్షుడిగా ముషీరాబాద్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ నాయకులు పులిరెడ్డి జైపాల్‌రెడ్డి నియమితులయ్యారు. ఈ మేరకు మంగళవారం గ్రేటర్ హైదరాబాద్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం.నర్సయ్య పార్టీ అధ్యక్షులు ప్రొఫెసర్ కొదండరామ్‌ల ఆధ్వర్యంలో ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. ముషీరాబాద్ నియోజకవర్గంలో తెలంగాణ జనసమితిని బలోపేతం చేయడానికి కృషి చేస్తానని, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్, ఎం.నర్సయ్యలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. నగర ప్రధాన కార్యదర్శి బట్టల రాంచందర్, బీసీసెల్ నగర అధ్యక్షుడు జశ్వంత్‌కుమార్, ముషీరాబాద్ కన్వీనర్ శ్రీనివాస్‌యాదవ్ తదితరులున్నారు.

## కార్మికుల శ్రమతో సంపద సృష్టి


కవులతో వైఎస్‌ఆర్ మూర్తి, గొర్తి వెంకటలక్ష్మి తదితరులు

**చిక్కడపల్లి:** కార్మికులు చేస్తున్న శ్రమతోనే సంపద సృష్టించబడుతుందని హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ చైర్మన్ వైఎస్‌ఆర్ మూర్తి అన్నారు. కార్మిక దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని మంగళవారం రాత్రి చిక్కడపల్లిలోని హ్యాపీ ఫ్రెండ్స్ సర్కిల్ సంస్థ కార్యాలయంలో 'ఏదీ ప్రగతి ?' అంశంపై కవి సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్‌ఆర్ మూర్తి మాట్లాడుతూ.. సమాజ సౌభాగ్యానికి కార్మికుల శ్రమ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సందర్భంగా నృత్యప్రదర్శన నిర్వహించారు. గొర్తి వెంకటలక్ష్మి, ప్రసాద్, సుబ్బలక్ష్మి, అరుణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## రంగంలోకి యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ టీమ్‌లు

**బంజారాహిల్స్:** వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో గత కొద్ది రోజుల నుంచి స్నాచింగ్‌లు పెరిగిపోయాయి. ఇందులో మొబైల్ ఫోన్ స్నాచింగ్‌లే ఎక్కువగా ఉంటున్నాయి. వెస్ట్ జోన్ పరిధిలో 10 రోజుల నుంచి మొబైల్ స్నాచింగ్‌లతోపాటు బస్సు ప్రయాణికుల మెడలోంచి గొలుసులు కూడా దొంగలు చోరీ చేస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నగర పోలీసు కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి స్నాచర్లపై ఉక్కుపాదం మోపి వారిని పట్టుకునేందుకు యాంటీ సెల్‌ఫోన్ స్నాచింగ్ టీమ్‌లను ఏర్పాటు చేశారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, పంజగుట్ట, ఎస్‌ఆర్‌నగర్, మధురానగర్, బోరబండ, ఫిలింనగర్, మాసబ్‌ట్యాంక్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ఒక్కో ఏసీపీ పరిధిలో నాలుగు టీమ్‌లు ఏర్పాటయ్యాయి. ఒక్కో టీమ్‌లలో ఇద్దరు స్థానిక పోలీసులు, మరో ఇద్దరు ఏఆర్ కానిస్టేబుళ్లు ఉంటారు. వీరంతా మఫ్టీలో ఉంటూ బస్ షెల్టర్లు, మార్కెట్లు, ఇతర రద్దీ ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై నిఘా పెడతారు. ముఖ్యంగా రోడ్ల పక్కన నిలబడి ఫోన్లు మాట్లాడే వారి వద్ద, రోడ్ల పక్కన బైక్‌లు, కార్లు ఆపుకుని ఉండేవారిని లక్ష్యంగా చేసుకుని ఈ స్నాచింగ్‌లు చేస్తుండటంతో ఇలాంటి ప్రాంతాలపైనే ఈ టీమ్‌లు దృష్టిపెట్టాయి. తాజాగా ఓ కారులో నుంచి సెల్‌ఫోన్ స్నాచింగ్ చేసి పరారవుతున్న ఇద్దరు కరుడుగట్టిన పాత నేరస్తులను బంజారాహిల్స్ టీమ్ ఛేజింగ్ చేసి సినీ ఫక్కీలో అరెస్టు చేసింది. ఇప్పుడు అన్ని పోలీస్‌స్టేషన్లలోనూ ఈ టీమ్‌లు అప్రమత్తంగా ఉంటూ స్నాచర్ల భరతం పట్టేందుకు సిద్ధమవుతున్నాయి. స్నాచర్లు, దొంగతనాలు జరిగే ప్రాంతాల్లో అనుమానితుల కదలికలపై దృష్టిపెడుతూ అక్కడే కాపుకాస్తూ నిఘా వేసి ఘటన జరిగిన సమయంలో వారిని వెంటాడి పట్టుకుంటున్నారు.

## రాజీవ్‌గాంధీకి ఘన నివాళి


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ తదితరులు


రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం


**కాచిగూడ:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హయాంలోనే దేశం అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిచిందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, జీహెచ్‌ఎంసీ మాజీ ఫ్లోర్‌లీడర్ దిడ్డి రాంబాబు అన్నారు. మంగళవారం బర్కత్‌పురలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. సాంకేతిక విప్లవం దేశంలో తెచ్చిన ఘనత రాజీవ్‌గాందీదేనన్నారు. పార్టీ నేతలు అశ్లేష్, బాలరాజు, ఓంప్రకాష్, మల్లేష్, దీపక్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

**ముషీరాబాద్ :** దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 33వ వర్ధంతి ముషీరాబాద్ డివిజన్ బాపూజీనగర్‌లో డివిజన్ అధ్యక్షుడు పెండెం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రధానిగా ఉన్న సమయంలో ఆయన చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ముషీరాబాద్ డివిజన్ మాజీ అధ్యక్షుడు జీ.ఎస్.చారి, రాజ్‌దీప్, సరితాగోవింద్, మహ్మద్‌గౌస్, డాక్టర్ మినాజ్, లింగంగుప్తా, శ్రీకాంత్‌గౌడ్, రమేష్, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

**నల్లకుంట:** దివంగత మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం నల్లకుంట తిలక్‌నగర్‌లో ఏపీ పీసీసీ ఎస్సీసెల్ మాజీ చైర్మన్ శ్యామ్‌రావు, పార్టీ సీనియర్ నాయకులు ఎస్. హరినాథ్ రెడ్డి, అజయ్‌కుమార్, సీహెచ్. మురళీకృష్ణ తదితరులు రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పించారు.

**శాస్త్ర సాంకేతిక రంగాల్లో దేశం అభివృద్ధి..**

**చిక్కడపల్లి:** దేశాన్ని శాస్త్ర సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చేసిన మహనీయుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ గాంధీనగర్ డివిజన్ అధ్యక్షుడు అభిషేక్ కెనడీ అన్నారు. మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతిని అశోక్‌నగర్ క్రాస్‌రోడ్డులో నిర్వహించారు. ఈ సందర్భంగా అభిషేక్‌కెనడీ మాట్లాడుతూ.. దేశాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపించారన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి ఎంతగానో కృషి చేశారని కొనియాడారు. నేతలు వీడి కృష్ణ, జయేందర్‌బాబు, శీలం సత్యనారాయణ, యాదగిరిగౌడ్, గుండు జగదీష్ బాబు, పుస్తకాల కవిత, మధుమతి తదితరులు పాల్గొన్నారు.


బాపూజీనగర్‌లో పెండెం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో..


తిలక్‌నగర్‌లో ఏపీ పీసీసీ ఎస్సీసెల్ ఆధ్వర్యంలో..

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు



**సుందరయ్య విజ్ఞాన కేంద్రం:** టీఎస్ఎస్‌పీడీసీఎల్ 11కేవీ ఆజామాబాద్ డివిజన్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో బుధవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏడీఈ విజయభాస్కర్ తెలిపారు. బర్కత్‌పురా ఫీడర్ పరిధిలో భర్కత్‌పురా, పద్మకాలనీ, శంకర్‌మట్ కూరగాయల మార్కెట్ తదితర ప్రాంతాల్లో 11 గంటల నుంచి 12.30, మూన్‌కేఫ్ ఫీడర్ పరిధిలో శ్రీరామ్‌నగర్, అచ్చయ్యనగర్, మూన్‌కేఫ్, హెరిటేజ్ ఫ్రెష్, బృందావన్‌కాలనీ తదితర ప్రాంతాల్లో 12.30 నుంచి 2 వరకు, విద్యానగర్ ఫీడర్ పరిధిలో విద్యానగర్, అడిక్‌మెట్ బ్లెడ్‌బ్యాంక్, వడ్డెర బస్తీ, ఎస్‌ఆర్టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో 2.30 నుంచి 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ వినియోగదారులు గమనించాలని కోరారు.

## టీ -సేవా కేంద్రాలకు దరఖాస్తుల ఆహ్వానం

**కాచిగూడ:** స్వయం ఉపాధి పొందేందుకు టీ–సేవ ఆన్‌లైన్ కేంద్రాల ఏర్పాటుకు అర్హత, ఆసక్తి గల అభ్యర్థుల నుంచి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి తెలిపారు. టీ–సేవ ఆన్‌లైన్ ద్వారా వివిధ బిల్లుల చెల్లింపులు, పాన్‌కార్డు సేవలు, బస్సు, ట్రైన్, విమాన టికెట్ల బుకింగ్స్, ఆల్ బ్యాంక్ మనీ ట్రాన్స్‌ఫర్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, వినియోగదారులకు మైక్రో ఏటీఎం సహా తదితర సేవలను అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధి పొందవచ్చని సూచించారు. ఈనెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 8179955744.

## జూన్ 9 వరకు జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన


ఎన్టీఆర్ స్టేడియంలో ప్రదర్శనను పరిశీలిస్తున్న దేవకీదేవి

**కవాడిగూడ:** ఎన్టీఆర్ స్టేడియంలో కొసాగుతున్న జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన జూన్ 9 వరకు కొసాగనున్నట్లు అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా రాష్ట్ర కమిటీ అధ్యక్షురాలు దేవకీదేవి తెలిపారు. మంగళవారం సాయంత్రం ఎన్టీఆర్ స్టేడియంలో ఆమె మాట్లాడుతూ... ఏప్రిల్ 13న ప్రారంభమైన జాతీయ చేనేత వస్త్ర ప్రదర్శన ఈనెల 26తోనే ముగియనుండగా.. నగరంలో కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రభుత్వం జూన్ 9 వరకు పొడిగించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా ఉన్న చేనేత, చేతి వృత్తుల వారు తయారు చేసిన వస్తువులు, వస్త్రాలు నగర ప్రజలకు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచాలనే ఉద్దేశంతో ఈ ప్రదర్శనను నగర ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## జాబ్‌మేళాకు విశేష స్పందన


అభ్యర్థులతో ఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు

**ముషీరాబాద్:** సొసైటీ ఫర్ రూరల్ డెవలప్‌మెంట్ (ఎస్‌ఆర్‌డీ) స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో రాంనగర్ చౌరస్తాలో మంగళవారం జాబ్‌మేళా జరిగింది. ఈ కార్యక్రమంలో ఐదు ప్రముఖ ప్రైవేటు కంపెనీలు కార్వాన్ టీపీఓ సొల్యూషన్స్, ప్రెస్‌కార్ప్, అమేజాన్, రత్నదీప్, టీమ్‌లీజ్ తదితర కంపెనీలు పాల్గొన్నాయి. సుమారు 80 మంది యువత ఈ జాబ్‌మేళాకు హాజరుకాగా.. సెలక్ట్ అయిన అభ్యర్థులకు ఆఫర్ లెటర్లను అందజేశారు. ఎస్‌ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ డైరెక్టర్ శ్రీపతి శ్రీనివాస్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉద్యోగం చేయడం వల్ల కుటుంబ ఆర్థిక పరిస్థితులు మెరుగవ్వడమే కాకుండా సమాజంలో మంచి గుర్తింపు, గౌరవం పెరుగుతాయన్నారు. ఎస్‌ఆర్‌డీ ప్రతినిధులు క్రాంతికిషోర్, నీలకంఠ మహదేవ్, బొల్లా రజనీ, రమణి, వెంకటేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న సినీ సంగీత విభావరి


గాయని అచ్యుతను సత్కరిస్తున్న నాగేందర్‌రావు తదితరులు

**చిక్కడపల్లి:** జీపీ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో సినీ సంగీత విభావరి ఆకట్టుకుంది. సంస్థ నిర్వాహకులు నాగేందర్‌రావు, శ్రీనివాస్‌నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి జరిగిన సంగీత విభావరిలో పలువురు గాయనీగాయకులు పాల్గొని ఏకగళ, యుగళ చిత్రగీతాలను మధురంగా ఆలపించారు. ఎస్‌బీఐ మాజీ జీఎం త్రినాథరావు, రజని, అనిత, సుబ్బిరెడ్డి, వెంకటేశ్వర్‌రావు, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## అనుమానాస్పదస్థితిలో యువతి అదృశ్యం

**బంజారాహిల్స్:** చేతిలో చిల్లిగవ్వ లేదు. రైలులో వెళ్లాలన్నా, బస్సులో వెళ్లాలన్నా డబ్బులు కావాలి. ఇంట్లో తల్లికి చెప్పకుండా పారిపోయే క్రమంలో ఓ యువతికి మహిళల ఉచిత బస్సు ప్రయాణం గుర్తుకువచ్చింది. ఇంకేముంది.. ఆధార్ కార్డు తీసుకుని ఇంట్లో నుంచి అదృశ్యమైంది. వివరాల్లోకి వెళితే... యూసుఫ్‌గూడ సమీపంలోని ఎల్‌ఎన్‌నగర్‌లో నివసించే రాణి కూతురు ప్రవల్లిక(17) ఇటీవలే పదో తరగతి పూర్తిచేసింది. ఈ నెల 19న పుట్టినరోజు సందర్భంగా స్నేహితురాలితో కలిసి బయటకు వెళ్తానని తల్లికి చెప్పగా ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో తల్లి పనికి వెళ్లిన తర్వాత ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాణి ఇంటికి వచ్చి చూడగా కూతురు కనిపించలేదు. ఆధార్‌కార్డుతోపాటు బంగారు ఉంగరాలు కూడా తీసుకెళ్లినట్లు గుర్తించింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేయగా బస్టాండ్ల వద్ద, చుట్టుపక్కల ప్రాంతాల్లో గాలింపు ముమ్మరం చేశారు. సీసీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు. మిస్సింగ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.